# సమాజ సేవయే సర్వేశ్వర సేవ

తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు
        కంఠమాలలవేవి కానరావు
మంచిముత్యపు సరుల్ మచ్చునకును లేవు
        మేల్మి బంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
        పచ్చలు కెంపులు పొదగ లేదు
వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు
        గోమేధికంబులు తోడ లేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
        పూర్వ జన్మల కర్మలు పొందుపరచి
ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి
మంచియైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల

ప్రేమస్వరూపులైనటువంటి విద్యార్థులారా! విద్యార్థినులారా!

మానవుడు ఎంత అదృష్టవంతుడో వర్ణించుటకు వీలుకాదు. "జంతూనాం నరజన్మ దుర్లభం", మానవ జన్మము చాలా దుర్లభమైనటువంటిది. ఇట్టి మానవత్వముయొక్క విశిష్టతను గుర్తించుకొనలేక మానవుడు భౌతిక, లౌకిక విషయములపట్ల ఆకర్షితుడవుతున్నాడు. మానవుడు భౌతిక జగత్తునుండి ఆవిర్భవించినటువంటివాడు

srisathyasaivachanamrutam

కాదు. నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము – ఈ మూడింటియొక్క ఏకత్వమే మానవ జీవితము. మానవుడనగా కేవలం దైవము యొక్క ప్రతిబింబమే! "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః", "మీరందరు కూడను నా అంశములేగాని, వేరు కాదు." ఇట్టి మానవత్వముయొక్క సత్యమును మనము గుర్తించుకొనలేక ఏవేవో అపోహలకు గురి అవుతున్నాము. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకునే నిమిత్తమై చదువులు చదవాలి, బాగా కష్టపడాలి. ఆ 'ఫండమెంటల్ ట్రూత్'ను తెలుసుకున్న తరువాత ఇంకేమీ మీకు అవసరం లేదు. ప్రాపంచికమైన ప్రతి కోరిక మిమ్మల్ని బంధనకు గురి చేస్తున్నది. ఆ బంధననుండి మనం విముక్తులం కావాలి. ఈ బంధన ఉండినంతవరకు మనము బాధలకు గురికాక తప్పదు. 'ఇది నాది, నాది, నాది' అనే భావము ఉండినంతవరకు ఆ వస్తువుపైన మనకు కోరిక ఏమాత్రము తరగదు. 'ఏదికూడను నాది కాదు. అంతా భగవంతునిదే,' అనే సత్యాన్ని గుర్తించాలి. All are one, be alike to everyone. 'అందరూ ఒక్కటే' అనే భావము మీలో అభివృద్ధి కావాలి. అప్పుడే మీకు ఆనందము, శాంతి లభిస్తాయి.

**కోరికలే శాంతికి అవరోధం**

ప్రేమస్వరూపులారా! మీరందరుకూడను ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తున్నారు. అయితే, 'ఆశకు తగినటువంటి ప్రయత్నం చేస్తున్నామా? లేదా?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలి. మొట్టమొదట మీ హృదయాన్ని మీరు పరిశీలించుకోండి. 'నేను ఏవిధమైన భావముతో ఈ జగత్తులో జీవిస్తున్నాను? కేవలం వాంఛల నిమిత్తమై జీవిస్తున్నానా? లేక, నిశ్చలంగా, నిర్మలంగా, నిస్వార్థంగా నా జీవితాన్ని గడుపుతున్నానా?' అని మీరు విచారణ చేయాలి. మీరు కోరికలను క్రమక్రమేణ తగ్గించుకుంటూ రావాలి. కోరికలు మన జీవిత ప్రయాణంలో 'లగేజి' వంటివి. Less luggage, more comfort make travel a pleasure. మీరు కోరికలను తగ్గించుకున్నప్పుడే మీకు తగిన శాంతి చిక్కుతుంది. మీరు రోజురోజుకీ వాంఛలను అభివృద్ధి చేసుకుంటున్నారేగాని, తగ్గించు కోవడానికి ప్రయత్నించడం లేదు.

ఇన్నివేలమంది ఇక్కడ చేరారు. అయితే, మీ అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. 'ఏకాత్మా

sri sathyasaivachanamrutam

సర్వ భూతాంతరాత్మా'. కాని, ఉపాధి భేదమును దృష్టిలో ఉంచుకొని మీరు ఇన్ని బాధలు పడుతున్నారు. నీవీనాడు ఒకడుగా ఉన్నావు. నీ చదువు పూర్తయిన తరువాత ఉద్యోగముకొరకు ప్రయత్నిస్తావు. మంచి ఉద్యోగము చిక్కిన తరువాత వివాహం చేసుకుంటావు. అప్పుడు మీరు ఇద్దరవుతారు. చేతికి ఒకే ఒక గాజు ఉన్నప్పుడు చేతిని ఎంత ఆడించినా అది ఏమాత్రము శబ్దము చేయదు. రెండు గాజులు చేరేటప్పటికి శబ్దము ప్రారంభమవుతుంది. క్రమక్రమేణ నీకు పిల్లలు కలుగుతారు; భౌతిక విషయములపైన నీకు ఆశ పెరుగుతుంది. ఈవిధంగా ఆశలు పెరుగుతూ వచ్చేకొలదీ నీకు శాంతి దూరమైపోతుంది. ఇవన్నీ కూడను కేవలం కోరికలవల్ల మనము కల్పించుకున్నవేగాని, సత్యమైనవి కావు. మీ భావములు సరియైనవిగా లేనప్పుడు మీకు బాధలే కలుగుతుంటాయి.

**పరులు పరాయివారు కాదు, పరమాత్మస్వరూపులే!**

అనవసరంగా ఈ సంసారంలో పడి లేనిపోని బాధలు పడే బదులు మీరు సమాజంలో ప్రవేశించి సేవ చేయండి. మీరు సమాజానికి సేవ చేసేకొలదీ మీకు బాధలు క్రమక్రమేణ తగ్గుతూ వస్తాయి. కనుక, 'లవ్ ఆల్, సర్వ్ ఆల్.' మీరు పరులను పరమాత్మ స్వరూపులుగా భావించాలేగాని, పరాయివారుగా భావించ రాదు. 'అతను, నేను ఒక్కటే' అని విశ్వసించాలి. మానవులంతా చేరి ఒక్కటే! మన కంటికి కనిపించేవన్నీ ప్రతిబింబములే! ఇవన్నీ కేవలం 'రిఫ్లెక్షన్లు', 'రియాక్షన్లు', 'రీసౌండ్లు.' ఈ సత్యాన్ని గుర్తించుకున్నప్పుడు మీకెంతనో శాంతి కలుగుతుంది. అప్పుడే చదువులందుగాని, ఉద్యోగములందుగాని మీ మనస్సు ఏమాత్రము అటూ ఇటూ చలించదు. కనుక, మీరు మొదట సమాజ సేవలో ప్రవేశించండి. సమాజ మంటే ఏమిటి? భగవంతుని ప్రతిబింబమే సమాజం. కాబట్టి, మనము సమాజానికి నిరంతరం సేవ చేస్తూ రావాలి. భగవంతుడు చేతులనిచ్చినది సేవలు చేయడానికేగాని, ఊరికే పేపర్లమీద పిచ్చిపిచ్చి వ్రాతలు వ్రాస్తూ కూర్చోవడానికి కాదు. మీరు సత్కర్మలు చేపట్టాలి. 'వర్క్ ఈజ్ వర్షిప్'. 'డ్యూటీ ఈజ్ గాడ్'. కనుక, మీ డ్యూటీ మీరు చేయండి.

ప్రేమస్వరూపులారా! ఈ వయస్సులో మీయందు అన్ని శక్తులూ సమృద్ధిగా ఉంటున్నవి.

మొట్టమొదటిది ఉపాధి (దేహము). ఉపాధికంటే ఉన్నత స్థాయిలో ఉన్నవి ఇంద్రియములు. ఇంద్రియములకంటే గొప్పది మనస్సు. మనస్సుకంటే గొప్పది బుద్ధి. బుద్ధికంటే గొప్పది ఆత్మ. కనుక, ఆత్మను మీరు నిరంతరము స్మరించుకుంటూ ఉంటే ఈ బంధనలనుండి విముక్తులు కాగలరు.

**ఈశ్వరునికి అమ్మ ఈశ్వరమ్మ**

ఈ దేహానికి మాతృమూర్తి ఈశ్వరమ్మ ఒకనాడు నీళ్ళు తీసికొని వచ్చే నిమిత్తం బావివద్దకు వెళ్ళింది. ఆ సమయంలో ఆమెను ఒకవిధమైన మైకం ఆవరించింది. ఆమె 'ఎందుకు ఇట్లవుతున్నది?' అని అనుకొంటుంటే, 'అమ్మా! నేను నీలో ప్రవేశిస్తున్నాను' అనే మాటలు ఆమెకు వినిపించాయి. 'ఇదెవరు? దయ్యమా? భూతమా? ఎవరు నాలో ప్రవేశిస్తున్నది?' అని ఆమె చాలా భయపడిపోయింది. అప్పుడు మళ్ళీ 'లోకసంరక్షణార్థమై నేను నీలో ప్రవేశిస్తున్నాను', అనే మాటలు ఆమెకు వినిపించాయి.

'ఈశ్వరమ్మ' అనే పేరు ఆమెకు తల్లిదండ్రులు పెట్టినది కాదు. ఈ దేహానికి తాతగారైనటువంటి కొండమరాజు పెట్టిన పేరు అది. ఈశ్వరమ్మ అనగా 'ఈశ్వరునికి అమ్మ' అని అర్థం. నేను చిన్నపిల్లవానిగా ఉన్నప్పుడే ఆయన నాయొక్క దివ్యత్వాన్ని గుర్తించాడు. "సత్యం! నీవు వయస్సులో చిన్నవాడవైనప్పటికీ తెలివి తేటలలో చాలా గొప్పవాడవు", అని అనేవాడు. ఈశ్వరమ్మ సామాన్యమైన స్త్రీ కాదు. తాను ఈశ్వరునికి తల్లిననే సత్యాన్ని గ్రహించి ఆమె ఎంతో ఆనందించింది. నాదగ్గరకు వచ్చి, 'నాయనా! 'ఈశ్వరమ్మ' అనే పేరు నాకు సార్థకమైన పేరు', అన్నది. ఎక్కడికి వెళ్లినప్పటికీ అందరూ ఆమెను 'ఈశ్వరాంబా! ఈశ్వరాంబా!' అని ఎంతో ప్రేమగా సంబోధించేవారు. ఆ పేరు వింటే ఆమెకు ఎంతో ఉత్సాహం, ఆనందం కలిగేవి.

**అపర యశోద కరణం సుబ్బమ్మ**

కరణం సుబ్బమ్మ మహాభక్తురాలు, గొప్ప గుణవంతురాలు. ఆమెను గ్రామంలో అందరూ గౌరవించేవారు. ఆమె నన్ను 'ఈశ్వరా! ఈశ్వరా!' అని పిలిచేది. క్రమక్రమేణ ఆమె మనస్సులో గొప్ప మార్పు వచ్చింది. నాకోసం ఇక్కడికి వచ్చిన భక్తులందరూ ఆమె ఇంట్లోనే భోజనం చేసేవారు. ఆమె ఏది చేసినా స్వామికోసమే చేసేది. నేనెప్పుడూ ఇంట్లో ఉండేవాడిని

sri sathyasaivachanamrutam

కాను. కొండల్లో, గుట్టల్లో తిరుగుతూ ఉండేవాడిని. ఆమె అనేక పదార్థాలు చేసి, టిఫిన్ క్యారియర్లో పెట్టుకొని, నేనెక్కడికి పోతే అక్కడికి వెతుక్కుంటూ వచ్చేది. ఆమెకు స్వామి అంటే చాలా గొప్ప ప్రేమ. ద్వాపరయుగములో కృష్ణుడు పుట్టినది దేవకికి. కాని, కృష్ణుని తల్లిగా పేరు వచ్చినది మాత్రం యశోదకు. అదేవిధముగా సుబ్బమ్మకుకూడా గొప్ప పేరు వచ్చింది.

చిన్ననాటినుండే నన్ను ప్రతి ఒక్కరూ ఒక అతీతమైన మానవునిగా చూస్తూ వచ్చారు. 'ఇతను సామాన్యమైన పిల్లవాడు కాదు. ఏదో దివ్యశక్తితో కూడినట్టు వంటివాడు', అని గుర్తించారు. ఆరోజుల్లో పిల్లలందరూ నావెంట పరుగెత్తుకుంటూ వచ్చేవారు. 'నీకేం కావాలి? నీకేం కావాలి?' అని ఒక్కొక్కరిని నేను అడిగేవాడిని. ఒకరు పెన్సిల్ కావాలని, ఒకరు పెన్ను కావాలని, మరొకరు పిప్పరమెంటు కావాలని ఈవిధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క కోరిక కోరేవారు. వాళ్ళు అడిగినవన్నీ ఒక ఖాళీ సంచీనుంచి తీసిచ్చే వాడిని. నాదగ్గర ఒక నయాపైసా ఉండేది కాదు. కాని, వాళ్లు అడిగినవన్నీ ఇస్తుంటే పిల్లలు 'ఇవన్నీ ఎక్కడినుండి వస్తున్నాయి?' అని వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకునేవారు. పోనీ, తల్లి ఏమైనా ఇస్తున్నదా? అంటే, ఆమెదగ్గర నయాపైసా కూడా లేదు. ఒకనాడు నేను నా బ్యాగును ప్రక్కకుపెట్టి లోపలికి వెళ్ళాను. ఆ పిల్లలు బ్యాగంతా వెతికి చూశారు. ఆ పిల్లలు సామాన్యులు కారు. అంతా బాగా వెతికారు. ఎక్కడా ఒక పిన్నుకూడా చిక్కలేదు. అప్పుడు, 'ఓహో! ఇవన్నీ ఎక్కడినుంచో వస్తున్నాయి', అని గ్రహించి ఎంతో ఆశ్చర్యపడ్డారు. ఈవిధంగా చిన్నప్పటినుండి పిల్లలు ఎప్పుడూ నావెంట తిరుగుతూ వచ్చారు.

### అసూయాపరులు చేసే దుష్ప్రచారం 'సత్యాన్ని' కదిలించలేదు

క్రమక్రమేణ స్వామి పేరుప్రఖ్యాతులు దిన దినాభివృద్ధి చెందుతూ వచ్చాయి. అందుచేత కొంతమందికి అసూయకూడా కలిగింది. అయితే, ఈ అసూయ మూలంగా స్వామి కీర్తి ప్రపంచమంతటా వ్యాపించింది. ఈనాడు అన్ని దేశముల వారు, అన్ని మతములవారుకూడను పుట్టపర్తికి వచ్చి వారివారి పండుగలను ఇక్కడ ఆనందంగా జరుపుకొని వెళుతున్నారు. డిసెంబరులో క్రిస్మస్ పండుగకు అనేకమంది క్రైస్తవులు ఇక్కడికి చేరుకుంటారు. మహమ్మదీయులుకూడా వచ్చి, 'స్వామీ! మా పండుగనుకూడా ఇక్కడ చేసుకుంటాము', అన్నారు. నేను చెప్పాను, అందరూ ఒక్కటే! "మతములన్నియు వేరు,



sri sathyasai vachanamrutam

గమ్యంబు ఒక్కటే! వస్త్ర భేదము వేరు, వస్తువొకటే! శృంగారములు వేరు, బంగారమొక్కటే!" అదేవిధముగా, అందరిలో ఉన్న ఆత్మతత్త్వమొక్కటే!

అన్ని దేశములవారు, అన్ని మతములవారు ఇక్కడికి రావడం చూసి కొంతమంది అసూయచేత స్వామికి విరుద్ధంగా కట్టుకథలు కల్పించి ప్రచారం చేస్తూ వచ్చారు. 'స్వామి కీర్తి దినదినాభివృద్ధి చెందుతున్నదే', అని వారిలో 'జెలసీ' పెరిగిపోయింది. ఈవిధమైన అసూయచేత లేనిపోని కథలు సృష్టించి, అనేక రకములైన చెడు విషయాలను కల్పించి వాటిని పేపర్లలో వేయడం... ఈవిధంగా జరుగుతూ వచ్చింది. ఇటీవల లండన్‌లో ఒక సభ జరిగింది. అక్కడ కొంతమంది చేరి ఈ దుష్ప్రచారాన్ని ఖండించారు. రిటైర్డ్ ఎయిర్ ఛీఫ్ మార్షల్ సూరి ఈ దుష్ప్రచారాన్ని ఎదుర్కొన్నాడు. దుష్ప్రచారం చేస్తున్నవారితో ఎన్నో విధములుగా వాదించాడు. వాళ్లు వ్రాస్తున్న చెడ్డ విషయాలను ఖండిస్తూ తానుకూడా పత్రికలలో వ్రాశాడు. దాంతో ఆ దుష్ప్రచారము నిలిచిపోయింది. "సత్యసాయిబాబాను గురించి వ్రాయాలంటే సత్యసాయిబాబా దగ్గర ఉండి, అన్నివిధాలుగా పరిశీలించి, స్వయంగా అనుభవించి ఆ తరువాతనే వ్రాయాలిగాని, ఎవరి మాటలో విని మీరు దుష్ప్రచారం చేయడం మంచిది కాదు", అని వాళ్లకు బుద్ధి చెప్పాడు.

ఎవరి మాటలో వింటే ఏమి వస్తుంది? తాము స్వయంగా చూచారా? విన్నారా? వారి మాటలమీద వారికే నమ్మకము లేదు. అలాంటిది యితరుల మాటలను ఎలా నమ్ముతారు? ఈ దుష్ప్రచారం అన్ని దేశములకూ ప్రాకుతూ పోయింది. ఇండియాకుకూడా వచ్చింది. విదేశ పత్రికలను, విదేశాలనుండి వచ్చే దుష్ప్రచారాన్ని వీరు అనుసరిస్తూ వచ్చారు. కాని, వారికి ఈవిషయంలో అనుభవమేమీ లేదు. ఈవిధంగా దుష్ప్రచారం చేస్తూ ఎట్లైనా స్వామికి చెడ్డపేరు తేవాలని ప్రయత్నించారు. అయితే, ఇది ఎవరివల్లా కాదు. ఈనాడే కాదు, ఏనాటికైనా, ఎవ్వరైనా స్వామి ప్రేమకు లొంగిపోవలసిందేగాని, స్వామి పేరుప్రతిష్ఠలను తగ్గించటానికి ఎవరి తరమూ కాదు. 'సాయి' అనే పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఇది శాశ్వతమైనది. దీనిని ఎవరూ మార్చలేరు. ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడవచ్చును. నాలుకకు ఎముక లేదు. అది ఎట్లంటే అట్లా తిరుగుతుంది. ఇంతేకాదు. కాసిన చెట్టుకే రాళ్ల దెబ్బలు! అదేవిధంగా, మంచి పనులు చేసేవారికే ఎన్నో కష్టనష్టములు వస్తుంటాయి. ఎన్ని

sri sathyasai vahini.org

వచ్చినప్పటికి మనము సత్యముపై ఆధారపడినప్పుడు మనలను ఎవ్వరూ కదిలించలేరు. సత్యముతో ఎవరు ఎంతగా పోరాడినప్పటికీ దానిని సాధించలేరు. కనుక, మీరు సత్యమును దృఢంగా పెట్టుకోండి. ఏమి జరిగినా మీరు వెఱువకూడదు. సత్యమును అంటిపెట్టుకుని ఉండేవారికి విజయం తథ్యం. కనుక, మనము సత్యాన్ని వదలకుండా ఉండాలి. భగవంతుడు సత్యస్వరూపుడు. Truth is God. సత్యమును ఎవ్వరూ కదిలించలేరు. "సత్యాన్నాస్తి పరో ధర్మః" ధర్మము శాంతి నిస్తుంది. శాంతి లేక మానవుడు జీవించలేడు. కనుకనే, త్యాగరాజు చెప్పాడు, 'శాంతము లేక సౌఖ్యము లేదు'. శాంతిని పోషించుకున్నప్పుడు ప్రేమ ఉద్భవిస్తుంది, ఆనందము లభిస్తుంది. సత్యము అంత గొప్పది. సత్యమునుండియే అహింస ఏర్పడుతుంది. సత్యమును అనుసరించేవాడు హింసకు పాల్పడడు. ప్రేమ ఉన్నటువంటివానికి హింసించాలనే భావమే రాదు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస – ఈ ఐదూ మానవునియొక్క పంచప్రాణములు. ఇవే మానవుని యొక్క ప్రధానమైన గుణములు. ఈనాడు ఈ మానవతా విలువలను పెంచాలి. అప్పుడే ఈ దేశమునందు తప్పక శాంతి ఏర్పడుతుంది.

**దైవప్రేమను స్థిరంగా పెట్టుకోండి!**

ఇప్పుడు ఎవరియందు చూచినా ఆశ, ఆశ, ఆశ! ఆ ఆశలకు ఒక హద్దే లేదు. మానవుడు ఎన్ని చదువులు చదివినా ఇంకా చదవాలని ఆశిస్తున్నాడు. తాను ఎన్నో పుస్తకాలు చదువుతున్నాడు. కాని, 'సెల్ఫ్ సేటిస్‌ఫేక్షన్' (ఆత్మసంతృప్తి) ఇవ్వని చదువులెందుకు! ఈ చదువులు జీవనోపాధికి మాత్రమే ఉపకరిస్తాయి. 'నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము – ఈ మూడింటితో కూడినదే నిజమైన విద్య', అని భారతీయ సంస్కృతి బోధిస్తున్నది. కాని, నేటి విద్యావేత్తలు ఈ సత్యాన్ని విస్మరిస్తున్నారు. కనుకనే, ఈనాటి మానవుడు ఎన్ని చదువులు చదివినా యేమీ ప్రయోజనము కనిపించడం లేదు.

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్**
**నిష్ఫలమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని ఈ**
**ప్రస్తుత విద్యలన్నియు ధాత్రి నిరర్థకము గాదె మానవా!**

sri sathyasai vachanamrutam

మీయందున్న ప్రేమను మీరు పోషించుకొనలేకపోయిన ప్రయోజనముండదు. దైవప్రీతి ఒక్కటి మాత్రం స్థిరంగా పెట్టుకోండి. మీ హృదయంలో దైవప్రేమను నింపుకుంటే అన్నీ సరిపోతాయి. ఆ ప్రేమ లేకుండిననాడు అన్నీ నాశనమై పోతాయి. దైవప్రేమ మెయిన్ స్విచ్ వంటిది. ఆ 'మెయిన్ స్విచ్'ను 'ఆన్'లో పెట్టి ఏ స్విచ్ వేసినా బల్బు వెలుగుతుంది.

**నాకు కించిత్తైనా దేహాభిమానము లేదు**

ఈ దేహమునకు తల్లియైన ఈశ్వరమ్మ నిరంతరం స్వామిని తలుచుకుంటూ ఉండేది. బృందావనంలో ఒకరోజు ఉదయం ఆమె స్నానము చేసింది, కాఫీ తీసుకుంది; వరండాలోకి వచ్చి కూర్చుంది. ఉన్నట్లుండి 'స్వామీ! స్వామీ! స్వామీ!' అని మూడు పర్యాయములు పిల్చింది. నేను 'వస్తున్నాను, వస్తున్నాను' అన్నాను. మెట్లు దిగి దగ్గరకు వెళ్ళాను. ఆమె ప్రశాంతంగా కన్ను మూసింది. ప్రాణము ఉండినంతవరకే దేహమునకు విలువ. ప్రాణము పోతూనే దేహము కట్టెతో సమానము. తక్షణమే ఆమె దేహమును పుట్టపర్తి తీసుకొని పోవలసిందని చెప్పాను. చాలామంది నన్నుకూడా వెళ్ళమని బలవంతం చేశారు. కాని, నేను వెళ్ళలేదు. అప్పుడు సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయి. ఆమె దేహాన్ని పంపించి అంత్యక్రియలు పుట్టపర్తిలోనే చేయించాను. నాకు ఏనాడూ కించిత్తైనా దేహాభిమానం లేదు. ప్రతిదానికి దేహాభిమానమే బంధన. దేహాన్ని భగవంతునికి అర్పితము చేస్తే ఏ బంధనా ఉండదు. ఇంద్రియాలుకూడా చలించకుండా ఉంటాయి. జీవితాన్ని భగవంతునికి అర్పితం చేసిన తరువాత ఏమి జరిగినప్పటికీ ఏదీ మిమ్మల్ని కదిలించలేదు.

**మీరు సమాజసేవ చేసినప్పుడే స్వామికి ఆనందము**

ప్రేమస్వరూపులారా! మీరు లౌకికమైన, భౌతిక మైన చదువులుకూడా చదువవలసిందే! ఎందుకంటే తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారు. వారినికూడా మీరు తృప్తిపరచాలి. "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ." వీరందరినీ సంతృప్తిపరచాలి. అప్పుడే దైవముకూడా మీకు ఆనందాన్ని అందిస్తాడు. దైవప్రేమ లేకుండా ఎన్ని చదువులు చదివినా యేమీ ప్రయోజనం లేదు. ఈ వయస్సులో మీరు చదువవలసింది చదవండి. సమాజములో సత్కీర్తిని సంపాదించండి. ఇదే నేను

sri sathyasaivachanamrutam

ఆశించేది. మీరు గొప్ప విద్యావంతులు కావాలని నేను కోరటం లేదు. ఎందరో గొప్ప చదువులు చదివారు. కాని, వారంతా ఏమి ఉపకారం చేశారు జగత్తుకు? ఏమీ చేయలేదు. కలాం గొప్ప చదువులు చదివాడు, సమాజసేవకు అంకితమయ్యాడు. మీరుకూడా సేవ చేసి సమాజాన్ని సంతోషపెట్టండి. సమాజమును సంతోషపెట్టినప్పుడే మీ జీవితం సార్థకమౌతుంది. మీరు సమాజమునకు తగిన సహాయము చేసినప్పుడే స్వామికి ఆనందము కలిగించినవారవుతారు.

**డా॥ రామ్‌శెట్టి కుటుంబంవారి త్యాగనిరతి**

నిన్నటి దినము డా॥ రామ్‌శెట్టి చాలా ఆనందంగా, 'స్వామీ! నేను అమెరికాకు తిరిగి వెళ్ళను, నా జీవితం యిక్కడే గడపాలి', అన్నాడు. అతని కుమారుడుకూడా తండ్రికి తగిన తనయుడే! అతనుకూడా డాక్టరే. అతనుకూడా చెప్పాడు, 'నీ ఇష్టమునకు మేము ఏమాత్రము అడ్డు రాము', అని. ఆయన, ఆయన భార్య, కుమారుడు, కుమార్తె నలుగురూ కలసి ఈ స్టేడియం నిర్మించారు. తమ ఇళ్ళు, భూములు అన్నీ అమ్మి ఆ ధనమును తెచ్చి బ్యాంకులో కట్టేశారు. చాలా త్యాగగుణముతో నలభై కోట్లు యిచ్చారు. ఇంతటి గొప్ప త్యాగభావము ఎంతమందికి వస్తుంది! ఈరోజుల్లో ఎవరైనా భిక్షగాడు యింటి ముందుకు వచ్చి, 'భవతీ భిక్షాం దేహి' అంటే, 'వెళ్ళిపో, వెళ్ళిపో' అని కసురుకుంటారు. కాని, ఆ కుటుంబములోనివారికి ఇలాంటి త్యాగభావము కలిగిందంటే ఎంత అదృష్టము! అమ్మాయి డాక్టరే, అబ్బాయి డాక్టరే. తుచ్ఛమైన విషయ సుఖాలపట్ల వారికి ఆసక్తి లేదు. స్వామి ఆజ్ఞను పాలించడమే వారికి ముఖ్యం. ఈ లౌకిక సుఖమొక సుఖమా! దీనివల్ల అన్నీ బాధలే! నిజముగా శాంతి, సంతోషములు ఒక్క ఆధ్యాత్మికములో తప్ప మరి దేనియందు లభ్యం కావని వాళ్ళు త్రికరణశుద్ధిగా విశ్వసించారు. ఇంతటి త్యాగగుణము, వైరాగ్యభావము అందరికీ సాధ్యమా! ఇది వాళ్ళ పూర్వజన్మ సుకృతఫలం.

విద్యార్థులారా! మీరు చదవండి, పెండ్లిండ్లు చేసుకోండి, పిల్లలను కనండి, ఆనందంగా ఉండండి. కాని, దైవచింతన మాత్రం మానకండి. ఏ మార్గము ననుసరించినా దైవాన్ని మరువకండి. దైవప్రేమను సాధించండి. అదే ఈనాడు మీకు స్వామి అందించే ఆశీర్వాద ఫలము. ఈ దివ్యనామమును వీధివీధి యందు చాటండి. అప్పుడే అందరియందూ

srisathyasaivachanamrutam

దైవత్వము ఆవిర్భవిస్తుంది. స్వామికి సమీపంగా వచ్చేకొలదీ మీలో దివ్యభావాలు అధికం కావాలి. అప్పుడే మీ జన్మ ధన్యమవుతుంది. ఈ లౌకికమైన సుఖాలు శాశ్వతం కాదు. ఈనాడు సుఖమంటారు, రేపటి దినము కష్టమంటారు. నేడు కొడుకు పుట్టాడని సంతోషంగా ఉంటారు; రేపు మరణిస్తే ఏడుస్తారు. ఈ నవ్వు, ఏడుపు ఎంతకాలం! 'మాకురు ధన జన యౌవన గర్వం హరతి నిమేషాత్ కాలస్సర్వం." అంతా క్షణభంగురమే! ప్రాపంచిక జీవితంలో కష్టసుఖాలు రెండూ భగవంతుని ప్రసాదములుగానే భావిస్తూ ఉండాలి.

విద్యార్థులారా! మీరు చిరంజీవులుగా ఉండండి. ఆనందంగా జీవించండి. సమాజసేవ చేయండి. సమాజసేవయే దైవసేవగా భావించండి. ఇదే మీకు నిజమైన శాంతి నందించేది.

**(తేదీ 23.11.2006, జన్మదినోత్సవ సందేశం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam